## క్లుప్తంగా

### నేడు జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం

హాజరు కానున్న మంత్రి,కలెక్టర్

**సాక్షి,మేడ్చల్ జిల్లా:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రజా పరిషత్(జెడ్పీ) సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అధ్యక్షతన జరగనుంది. సమావేశానికి జిల్లా మంత్రి మల్లారెడ్డి ,ఎమ్మెల్సీలు, కలెక్టర్ హరీష్, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు ,జెడ్పీటీసీలు ,ఎంపీపీలు హాజరు కానున్నారు. జిల్లాలోని ఐదు మండలాలకు సంబంధించిన ప్రజా సమస్యలు చర్చించి ,తగిన నిర్ణయాలు తీసుకోవటం జరుగుతుందని జెడ్పీ సీఇఓ దేవసహాయం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు ,సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

### సేవచేయడంలోనే ఆనందం

**జవహర్‌నగర్:** నిరుపేదలకు సేవచేయడంలోనే ఆనందం ఉంటుందని 28వ డివిజన్ టీఆర్ఎస్ అధ్యక్షుడు బూడిద వెంకటేష్‌మాదిగ అన్నారు. శుక్రవారం మదర్‌థెరిస్సా కాలనీలో కుష్ఠురోగులకు గ్రేస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ గ్రేస్ స్వచ్ఛంద సంస్థ నిరుపేదల కాలనీల్లో ఉచితంగా సేవలు చేయడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో స్వచ్ఛంద సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రేస్ సొసైటీ ప్రతినిధులు మురళీకృష్ణారెడ్డి, సైదులు, సతీష్‌లతో పాటు స్థానిక నాయకులు సుజాత, రమేష్, మేరీ తదితరులు పాల్గొన్నారు.

### బస్సు సర్వీసు ప్రారంభం

**పోచారం:** ప్రయాణికులు, విద్యార్థులు, కార్మికుల సౌకర్యార్థం ఆర్టీసీ కేటాయించిన నూతన బస్ సర్వీసును కౌన్సిలర్ బద్దం మమత జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోచారం నుంచి బస్ సర్వీస్ నడపాలని మంత్రి మల్లారెడ్డితో పాటు ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతిపత్రాలు అందజేయడంతో స్పందించి బస్సును కేటాయించారన్నారు. దీంతో పురప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సరేష్ గౌడ్, మధుసూదన్‌రెడ్డి, హరి, శ్రీశైలం, బాలరాజు, శేఖర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

### ఏబీవీపీ ఎల్‌బీనగర్ విభాగ్ కన్వీనర్‌గా శ్యామ్‌కిరణ్

**ఘట్‌కేసర్:** ఏబీవీపీ ఎల్‌బీనగర్ విభాగ్ కన్వీనర్‌గా ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన అంకం శ్యామ్‌కిరణ్ ఎన్నికయ్యారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన భాగ్యనగర్ బైఠక్‌లో ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ఆయనను నియమించారు. ఈ సందర్భంగా శ్యామ్‌కిరణ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం శాయశక్తుల కృషి చేస్తానని, సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాలు, ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై పోరాడతామన్నారు.

### వితంతు మహిళకు చేయూత

**పోచారం:** అన్నోజిగూడ వికలాంగుల కాలనీకి చెందిన వితంతు మహిళ ఐలమ్మకు చిరు వ్యాపారం ద్వారా జీవనోపాధి కల్పించేందుకు శ్రీరాజమాత ఫౌండేషన్ చేయూత అందించింది. అందుకు కావాల్సిన తోపుడు బండితో పాటు తినుబండారాలను సమకూర్చింది. శుక్రవారం తోపుడు బండి వ్యాపారాన్ని టీవీ సీరియల్ నటుడు ముఖేష్ గౌడ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారంలో నిలదొక్కుకొని కుటుంబాన్ని పోషించుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం తొలి బోణీగా రూ. 500 ఇచ్చి తినుబండారాలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ స్థాపక అధ్యక్షుడు ఉదయ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మనోజ్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు పాండు, జైప్రదీప్, అంజలి, కావ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

### అప్పుల రాష్ట్రంగా తెలంగాణ

ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

**పోచారం:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులు అందించగలిగిన హైదరాబాద్ ఇప్పుడు కేవలం తెలంగాణకే అందిస్తున్నప్పటికీ కేసీఆర్ హయాంలో తెలంగాణ అప్పుల రాష్ట్రంగా తయారైందని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం అన్నోజిగూడలో జరిగిన శక్తి కేంద్రం కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ... రూ. ఐదు లక్షల కోట్ల అప్పుల భారాన్ని తెలంగాణ మోస్తోందన్నారు. రాష్ట్ర ఆదాయంలో చాలా వరకు అప్పులపై వడ్డీలు కట్టేందుకే పోతుంటే అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం వస్తే అప్పుల భారం నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, సీనియర్ నాయకులు నరేందర్‌రావు, అమరమోహన్‌రెడ్డి, బిక్కు నాయక్, మోహన్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లకు మరమ్మతులేవీ..!

- గతుకుల రోడ్లతో శివారు పురపాలికల్లో అవస్థలు
- వాహన చోదకుల ఇబ్బందులు
- రూ.లక్షల్లో పన్నులు వసూలు...
- నిధులు మంజూరైనా పట్టించుకోని అధికారులు





రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిన నాగారం–ఘట్కేసర్ ప్రధాన రోడ్డు

**సాక్షి,మేడ్చల్ జిల్లా:** గ్రేటర్ శివారు పురపాలక సంఘాల్లో ప్రజలు ప్రధానంగా రోడ్లు,డ్రైనేజీ సమస్యను ఎదుర్కొంటున్నారు. వర్షాలతో పాటు ఇతరతర కారణాలతో దెబ్బతిని గుంతలుగా మారిన ప్రధాన ,అంతర్గత రోడ్లతో సహా మురికి కాలువల కనీస మరమ్మతులు చేపట్టక పోవటంతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధ్వాన్నంగా మారిన రోడ్ల వల్ల వాహనాలు దెబ్బతినటంతోపాటు తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రజల నుంచి ముక్కు పిండి వివిధ రకాల పన్నులను వసూలు చేస్తున్న పురపాలికలు పట్టణాల్లో గుంతలుగా మారిన ప్రధాన ,అంతర్గత రోడ్లు ,దెబ్బతిన్న మురికి కాలువల మరమ్మతులకు చర్యలు తీసుకోకపోవడంపై అందోళన వ్యక్తంచేస్తున్నారు. కొత్త రోడ్లు, మురికి కాలువల నిర్మాణం అటుంచితే... తరచుగా దెబ్బతింటున్న రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థల మరమ్మతులను పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మచ్చుకు కొన్ని..**

- పీర్జాదిగూడ, బోడుప్పల్ నగర పాలక సంస్థల్లో భారీ వర్షాల కారణంగా దాదాపు 10 కిలో మీటర్ల ప్రధాన రోడ్లు, మురికి కాలువలు దెబ్బతిన్నాయి. వీటి నిర్మాణానికి ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ కింద రూ.110 కోట్లు విడుదల చేయగా, అదనంగా 31శాతం నిధులను నగర సంబంధిత పాలక సంస్థలు కంట్రిబ్యూషన్ కింద చెల్లించటం ద్వారా పనులు చేపట్టాలని సర్కారు సూచించింది. ఈ నిధులు విడుదలై ...దాదాపు ఏడాది గడిచినా రోడ్ల, డ్రైనేజీ నిర్మాణ పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందంగా ఉంది.
- నాగారం మున్సిపాలిటీలో కొమటికుంట నుంచి దాయారకుంట వరకు రోడ్డు ,డ్రైనేజీ నిర్మాణానికి రూ.6 కోట్లు నిధులు విడుదలై నెలలు గడుస్తున్నా.... పనులు మాత్రం నత్తకు నడక నేర్పుతున్నాయి
- నాగారం నుంచి వయా రాంపల్లి మీదుగా ఘట్కేసర్ వరకు ఉన్న 50 అడుగుల ప్రధాన రోడ్డును 100 అడుగుల రోడ్డుగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనలను పురపాలికలు పట్టించుకోకపోవటంతో ఇప్పటి వరకు ఈ రోడ్డులో పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరగగా, నలుగురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు.ఈ ప్రధాన రోడ్డు చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంతోసహా వరంగల్–హైదరాబాద్, కరీంనగర్–హైదరాబాద్ హైవేలు, అవుటర్ రింగ్ రోడ్‌కు ఉండటంతో వాహనాల రాకపోకలతో అనునిత్యం రద్దీగా ఉంటోంది. పైగా విద్యాసంస్థలు ,గ్యాస్ కంపెనీలు ,వ్యాపార ,వాణిజ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ రోడ్డు అభివృద్ధి పై జిల్లా మంత్రి మల్లారెడ్డి చొరవ చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.
- దమ్మాయిగూడ మున్సిపాలిటీలో పలు రోడ్లు, డ్రైనేజీ పనులకు రూ.18 కోట్లు మంజూరు కాగా, పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- ఇవే పరిస్థితులు జవహర్‌నగర్‌తోపాటు నిజాంపేట, ఘట్కేసర్, పోచారం, కొంపల్లి, దుండిగల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, మేడ్చల్ పురపాలక సంఘాల్లో దర్శనమిస్తున్నాయి. రోడ్లు,డ్రై నేజీలు, నాలాలకు మరమ్మతులు లేక పూర్తిగా దెబ్బతినగా, గతంలో భారీగా కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను పట్టించుకున్న దాఖలాలు లేవు.

**ముక్కు పిండి పన్నులు వసూలు..**

గ్రేటర్ శివారు మేడ్చల్ జిల్లాలో 4 మున్సిపల్ కార్పొరేషన్లు,9 మున్సిపాలిటీల ప్రజల నుంచి ముక్కు పిండి వివిధ రకాల పన్నులను ప్రతి ఏటా రూ.211 కోట్లు వసూలు చేస్తున్నా.. ప్రజలకు మాత్రం సేవలను అందించటంలో, సమస్యలను పట్టించుకోవటంలో పూర్తిగా విఫలమయ్యారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నుంచి కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ.3 లక్షల నుంచి రూ.21 లక్షల నిధులు విడుదల అవుతున్నప్పటికీ సమస్యలను పరిష్కరించలేకపోతున్నాయి. పట్టణ ప్రగతి పేరుతో ప్రభుత్వం పురపాలక సంఘాల అభివృద్ధికి బాటలు వేస్తున్నప్పటికీ పాలక వర్గాలు, అధికారగణానికి పట్టణ ప్రగతి పట్టటం లేదు. పైగా అక్రమ నిర్మాణాలు,వెంచర్లు, లేఅవుట్లు, పదవుల పంపకాల నెపంతో అక్రమంగా సంపాదనను వాటాల ప్రకారం పంచుకోవటంలో మాత్రం వారు పోటీ పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### రోడ్డు వెడల్పు చేయాలి



నాగారం –ఘట్కేసర్ ప్రధాన రోడ్డును 50 అడుగుల నుంచి 100 అడుగుల వరకు వెడల్పు చేయకపోవటంతో తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో ఆరు నెలల్లోనే నలుగురు వ్యక్తులు మృతి చెందారు. జిల్లా మంత్రి మల్లారెడ్డి ఈ రోడ్డు సమస్యపై వెంటనే స్పందించాలి.

– బి.పరమేష్ ,రాంపల్లి–నాగారం మున్సిపాలిటీ

### నాగారం మున్సిపల్ కమిషనర్‌కు ఓడీఎఫ్ సర్టిఫికెట్



**కీసర:** స్వచ్ఛ సర్వేక్షన్ –2022 లో భాగంగా నాగారం మున్సిపాలిటీకి ఓపెన్ డెఫికేషన్ ఫ్రి (ఓడీఎఫ్) సర్టిఫికెట్‌ను మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డికి జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్యతో కలిసి అందజేస్తున్న పురపాలకశాఖ మంత్రి కేటీఆర్.

### ఘనంగా నవ శత చండీయాగం



యాగంలో పాల్గొన్న భక్తులు

**మేడ్చల్‌రూరల్:** మండలంలోని రాజబొల్లారం తండా గ్రామ పరిధిలోని లక్ష్మిదుర్గ సరస్వతీ దేవాలయంలో శుక్రవారం ఆరుద్రోత్సవం, పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు నవశత చండీయాగం నిర్వహించారు. స్వామి పరిపూర్ణానంద, మనోహరాచార్య ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పూజలు, యాగంలో పాల్గొన్నారు.

### గిర్మాపూర్ గుట్టల మల్లన్న జాతరకు సన్నాహాలు



గిర్మాపూర్‌లోని గుట్టల మల్లన్న ఆలయం

**మేడ్చల్:** ఏటా జనవరి నెల మొదటి ఆదివారం నిర్వహించే గిర్మాపూర్ గుట్టల మల్లన్న జాతరకు మల్లన్న ఆలయం ముస్తాబయ్యింది. ఈనెల 8న జాతర నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ప్రతి సంవత్సరం మొదటి ఆదివారం జాతర నిర్వహించడం అనవాయితీగా వస్తుండటంతో ఈ సంవత్సరం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. మల్లన్న కళ్యాణం, కొండపోచమ్మ జాతర,బోనాలు, అగ్ని గుండాలు, పోతరాజుల నృత్యాలు, తొట్టెల ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆలయకమిటీ కోరింది.

### గణతంత్ర వేడుకలకు అనురాగ్ ఎన్‌సీసీ కేడెట్లు




గణతంత్ర వేడుకలకు ఎంపికైన ఎన్‌సీసీ కేడెట్లు

**ఘట్‌కేసర్:** న్యూ ఢిల్లీలో జరుగనున్న గణతంత్ర దినోత్సవ క్యాంపు–2023కి వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ) ఇద్దరు ఎన్‌సీసీ కేడెట్లు ఎంపికయ్యారు. క్యాంపునకు ఎంపికైన ఈసీఈ విద్యార్థిని ఉషస్విని, మెక్ డిపార్ట్‌మెంట్ ఎస్‌జీటీ లక్ష్మీ వెష్ణవి, ఎన్‌సీసీ అధికారి మల్లేశ్‌ను యూనివర్సిటీ చైర్మన్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీఈఓ నీలిమా, ఉప కులపతి రామచంద్రం, రిజిస్ట్రార్ ఫాతిమా అభినందించారు.

## బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

**మేడ్చల్:** మేడ్చల్ మండలంలో బీజేపీని మరింత బలోపేతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఉమ్మడి మండలశక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలన్నారు. బూత్ స్థాయి కమిటీలనుండి గ్రామ స్థాయి కమిటీల వరకు విస్తృతంగా పని చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలన్నారు. ఎన్నికల సంవత్సరం కావడంతో ప్రతి కార్యకర్త గ్రామాలలో నిత్యం కష్టపడాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తను అధిష్టానం గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల నాయకులు పాల్గొన్నారు.

## పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలి

త్రివేంద్రం యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ అజయ్‌గోష్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ అజయ్‌గోష్

**జవహర్‌నగర్:** పరిశోధనపై విద్యార్థులు దృష్టి సారించాలని సీఎస్ఐఆర్ ఎన్ఐఎస్‌టీ త్రివేంద్రం యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.అజయ్‌గోష్ అన్నారు. శుక్రవారం జవహర్‌నగర్ పరిధిలోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో 'నేషనల్ సింపోసిమ్ ఆన్ కన్వర్జన్స్ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ మెటీరియల్స్' (సీసీఎం –2023)పై జాతీయ సదస్సు నిర్వహించారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి దాదాపు 160 మంది ప్రతినిధులు, 17 మంది ప్రొఫెసర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అజయ్‌గోష్ మాట్లాడుతూ... ఇందన పరిశోధన, ఖనిజాల పునరుత్పత్తి, భౌతిక, రసాయన శాస్త్రాల్లో ఎన్నో నూతన పరిణామాలు వచ్చాయన్నారు. పరిశోధన రంగాన్ని ప్రోత్సహించి నూతన ఆవిష్కరణలు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. చాలా మంది విద్యార్థులు ఉద్యోగం వెతుక్కుని అనుచరుడిగా ఉండటానికే ఇష్టపడుతున్నారని.. ఉద్యోగాలు సృష్టించి లీడర్‌గా మారాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులు ముందుకు రావాలని, వివిధ రంగాల్లోని ఇంజనీర్లు ముందుకొచ్చి టెక్నాలజీతో కొత్త అవకాశాలను సృష్టించాలన్నారు. మెరుగైన పరిశోధనలు జరిగి దేశంలో నూతన ఆవిష్కరణలకు హైదరాబాద్ బిట్స్ క్యాంపస్ కేంద్రంగా మారాలని ఆకాంక్షించారు. ప్రతినిధులకు ప్రసంశ పత్రాలను అందజేశారు. బిట్స్ డీన్ అడ్మిన్ నిరంజన్‌సేన్, కెమిస్ట్రీ హెచ్‌వోడీ సౌనత్‌రాయ్, కన్వీనర్ చందల్ చక్రవర్తి, బిట్స్ ప్రొఫెసర్ కె.వి.జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### మున్సిపల్ సిబ్బందికి సన్మానం

**పోచారం:** బహిరంగ మల విసర్జన రహిత మున్సిపాలిటీగా పోచారం అవార్డును సాధించిన సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఇతర సిబ్బందిని చైర్మన్ కొండల్‌రెడ్డి శుక్రవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, నాయకులు బద్దం జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### పోలీసుల అదుపులో ఫొటోల మార్ఫింగ్ నిందితుడు

**ఘట్‌కేసర్:** అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినుల ఫొటోలు మార్ఫింగ్ చేసి వేధించిన సంఘటన జిల్లాలో సంచలనం లేపింది. నిందితుడిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, పలు యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కళాశాలకు చెందిన పలువురు విద్యార్థినుల వాట్సాప్, డీపీల్లోని ఫొటోలు మార్ఫింగ్ చేసి ఇంటర్‌నెట్‌లో పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. విద్యార్థినుల ఫోన్ నంబర్లు, పలు సిమ్‌లు ఎలా సేకరించాడన్న విషయంపై అతడిని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

## రహదారుల అభివృద్ధికి కృషి



బీటీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

**కీసర:** గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయనున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం భోగారం ప్రధాన రహదారినుంచి –కీసరగుట్ట పాదాల రహదారి వరకు, అంకిరెడ్డిపల్లి చౌరస్తానుంచి కేశవపూర్‌వరకు సుమారు రూ 1.30 కోట్ల నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలోని పలు మండలాలతో పాటు, మున్సిపాలిటీల్లో రహదారుల మరమ్మత్తుకు నిమిత్తం కేటాయించడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో రహదారుల విస్తరణతోపాటు, మరమ్మతు పనుల నిమిత్తం మరిన్ని నిధులను కేటాయిస్తామన్నారు. బీటీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, ప్రణీతాగౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు మోరవి మల, మాధురి, పెంటయ్య, మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

- కార్మిక మంత్రి మల్లారెడ్డికి వినతి



మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నవయుగ బీడీ కార్మిక సంఘం నాయకులు

**జవహర్‌నగర్:** రాష్ట్రంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు సరైన వేతనాలు చెల్లించాలని నవయుగ బీడీ కార్మిక సంఘం అధ్యక్షురాలు అరుణ, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరావ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధానంగా ఉత్తర తెలంగాణలో విస్తరించి ఉన్న బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు 2012లో విడుదలైన కనీస వేతనాల జీవో నెంబర్ 41 నేటి వరకు అమలు కావడం లేదన్నారు. కార్మికులందరికీ జీవనభృతి కల్పించాలన్నారు. అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి.అనురాధ, మల్లేష్, మణెమ్మ, పద్మ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన ప్రదర్శనకు నిధులు మంజూరు




నిధుల మంజూరు పత్రం అందుకుంటున్న చైర్మన్ నర్సింహారెడ్డి

**మేడ్చల్‌రూరల్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు శాస్త్ర, సాంకేతిక విభాగం రూ. 21 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు నిధుల మంజూరు పత్రాన్ని కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి స్వీకరించారు. గ్రామీణ విద్యార్థులకు శాస్త్ర, సాంకేతికపై అవగాహన కల్పించి అందులో వారు రాణించేలా ప్రోత్సహించేందుకు, విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు నిధులు ఉపయోగపడనున్నాయి. విద్యార్థులకు విజ్ఞానశాస్త్రం, నూతన సాంకేతికతపై అవగాహన కల్పించి వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేపట్టేందుకు కృషి చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ లోకనాథం తెలిపారు. కళాశాలకు నిధులు కేటాయించడంపై చైర్మన్ నర్సింహారెడ్డి, సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, హర్షం వ్యక్తం చేశారు. నిధులు సక్రమంగా ఉపయోగించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తివారి, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలబాలికల రక్షణకు టోల్‌ఫ్రీ నంబర్



మాట్లాడుతున్న సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి

**ఘట్‌కేసర్:** బాలబాలికల రక్షణ కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం ఇవ్వాలని సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అవుషాపూర్ పంచాయతీ కార్యాయంలో కార్యదర్శి గౌతమి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి నెల నిర్వహించనున్న గ్రామ సభలో బాలల రక్షణపై చర్చించాలన్నారు. 0–18 ఏళ్ల లోపు బాలల భద్రత, బాలల భిక్షాటన, బాల కార్మికులు, తప్పిపోయిన వారి వివరాలు, బాలలపై జరిగిన అఘాయిత్యాలపై టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఐలయ్యయాదవ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ఉపాధ్యాయులుగా గుర్తించాలి




మూడుచింతలపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

**శామీర్‌పేట్:** అంగన్‌వాడీ టీచర్లను ఉపాధ్యాయులుగా గుర్తించాలని సీఐటీయూ శామీర్‌పేట మండల కార్యదర్శి కిష్టప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతి పథకంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమన్నారు. వీరికి ఈఎస్ఐ, పీఎఫ్‌లు వర్తింపజేయడంతో పాటు రూ. 25వేల జీతం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీ, లావణ్య, జయప్రభ, భాగ్యలక్ష్మీ, శకుంతల, పుష్ప, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

- కీసరగుట్ట ఆలయ చైర్మన్‌గా రమేష్‌శర్మ ప్రమాణ స్వీకారం
- ఆలయ అభివృద్ధికి రూ. 50 కోట్లు మంజూరు చేయనున్న సీఎం
- మంత్రి చామకూర మల్లారెడ్డి



కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి..

**కీసర:** ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాల్లో భక్తులకు మెరుగైన వసతులు కల్పించి ఆయా ఆలయాల సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కీసరగుట్ట శ్రీ భవానీరామలింగేశ్వర స్వామి దేవస్థానం నూతక చైర్మన్‌గా తటాకం రమేష్‌శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... కీసరగుట్ట ఆలయ అభివృద్ధికి సీఎం కేసీఆర్ త్వరలో సుమారు రూ. 50 కోట్ల మేర నిధులు మంజూరు చేయనున్నారని వెల్లడించారు. నగరానికి చేరువలో ఉన్న కీసరగుట్టకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలప్పుడు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేయాలని కొత్త చైర్మన్ రమేష్‌శర్మకు మంత్రి సూచించారు. అందరి సహకారంతో కీసరగుట్టను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు మంత్రి కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు మంత్రి మల్లారెడ్డికి స్వామివారి ఆశీస్సులతోపాటు, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, ప్రణీతాగౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు మాధురి, పెంటయ్య, మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు, దేవాలయ రినోవేషన్ కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.